# ఆయకట్టులో ముమ్మరంగా వరినాట్లు

- వెత్తనాలు వెదజల్లడం, డ్రమ్ సీడర్ పద్ధతికి రైతుల మొగ్గు
- రైతులకు తగు సూచనలు ఇస్తూ ప్రోత్సహిస్తున్న అధికారులు
- ఖర్చు కూడా తగ్గుతుండడంతో రైతుల ఆసక్తి


చిలుకూరులో నాట్లు వేస్తున్న కూలీలు


నారాయణపురంలో నారు తీస్తున్న కూలీలు


చిలుకూరులో మడి సిద్ధం చేసుకుంటున్న రైతు

**చిలుకూరు:** సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్నేళ్లుగా రైతులు కూలీలతో నాటు వేసే పద్ధతిలో సాగు చేసేవారు. ప్రస్తుతం కూలీల కొరతను అధిగమించడానికి నూతన వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నారు. ప్రధానంగా నేరుగా విత్తనాలు వెదజల్లడం, డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసేందుకు వ్యవసాయాధికారులు సైతం రైతులు తగు సూచనలు అందజేస్తూ పోత్సహిస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేయడం ద్వారా సుమారుగా గతంలో కంటే ఎకరానికి రూ. 3 వేలు ఖర్చు తగ్గుతుంది. మరి కొంత మంది రైతులు మాత్రం పాత పద్ధతలోనే కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తుడడం, సాగర్ నీళ్లు విడుదల చేయడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వానాకాలం పంట సాగు అనుకూలంగా ఉండడంతో మంచి దిగుబడులు సాధించారు. అదే ఉత్సాహంతో మళ్లీ నాట్లు మొదలుపెట్టారు.

## కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యం

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య యాదవ్

**కోదాడ:** మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి కోదాడ నియోజకర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. వారు చేసిన అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని విమర్శించారు.ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సొమ్ముతో హెలిక్యాప్టర్‌లో మంత్రులను వేసుకొని తిరగడం తప్ప ఆయన సంవత్సరకాలంగా చేసింది ఏమిటో చెప్పాలన్నారు. వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసానని చెప్పుకుంటున్న మంత్రి, ఎమ్మెల్యే ఎక్కడైనా తట్టెడు మట్టి ఎత్తిన పనులు జరిగి ఉంటే చెప్పాలని ఆయన సవాలు చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే కోదాడలో రోడ్ల విస్తరణ చేపట్టామని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ఎస్‌కె.నయీం, నర్సిరెడ్డి, భట్టు శివాజీ, అనంతుల ఆంజనేయులు, శెట్టి సురేష్‌నాయుడు, నాగిరెడ్డి, పిట్టల భాగ్యమ్మ, కర్ల సుందర్‌బాబు, రాంబాబుగౌడ్ పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

**హుజూర్‌నగర్ (చింతలపాలెం) :** హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని చింతలపాలెం మిల్లులో పత్తి కొనుగోళ్లను సోమవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిగుమతికి స్థలం లేనందున తాత్కాలికంగా నిలిపివేసిన పత్తి కొనుగోళ్లు మళ్లీ ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు తమ పత్తిని చింతలపాలెంలో గల రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఆయన సూచించారు.

## క్లుప్తంగా

### కార్పెంటర్స్ యూనియన్ ప్రమాణ స్వీకారోత్సవం


ప్రమాణ స్వీకారం చేసిన కార్పెంటర్స్ యూనియన్ సభ్యులు

**మఠంపల్లి:** నూతనంగా ఏర్పడిన మండల కార్పెంటర్స్ యూనియన్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్పెంటర్స్‌కు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ,రేషన్‌కార్డులు ఇప్పించడంతోబాటు, బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు తాల్లూరి జనార్ధనాచారి, ప్రధాన కార్యదర్శి బాణాల సాంబయ్యాచారి, కోశాదికారి గోధుమల మధుచారి, గౌరవాధ్యక్షుడు కాసాని వీరాచారి, కట్టా సత్యనారాయణాచారి, శ్రీరాముల బ్రహ్మాచారి పాల్గొన్నారు.

### ప్రచారయాత్ర కరపత్రం ఆవిష్కరణ


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

**మోతె:** మండల పరిధిలో రావిపహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలని ఈ నెల 11 నుంచి ప్రచారయాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం-ఎల్)మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు కారింగుల వెంకన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం రావిపహాడ గ్రామంలో ప్రచారయాత్ర కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా గ్రామంలో ఇథనాల్ కంపెనీ నిర్మించడం చట్ట విరుద్ధమన్నారు. ఇథనాల్ కంపెనీని రద్దు చేసి ప్రజల ప్రాణాలు రక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మాస్‌లైన్ నాయకులు సయ్యద్, నారాయణరెడ్డి, సీపీఎం నాయకులు సోమగాని మల్లయ్య,కొప్పు వెంకన్న, బండి వేణు, ఉప్పలయ్య, మశు పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి

**నడిగూడెం :** పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన ఏజన్సీ నిర్వాహకుల సంఘం మండల అధ్యక్షురాలు ఉమ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఏడు నెలలుగా బిల్లులు మంజూరు కావడంలేదని, అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

### కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరిక


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న మాజీ ఎంపీటీసీ రాజారావు

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పీఏసీఎస్ డైరెక్టర్ అంబల్ల సైదులు, పాదిల భిక్షం తదితరులు మాజీ ఎంపీటీసీ చీకూరి రాజారావు సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎంపీటీసీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ మియా, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వీరమల్ల సుందరయ్య, కోటయ్య, ఏడుకొండలు, బాలసైదా, కోటయ్య, ఉపేందర్, నారాయణ, సైదులు, వెంకటేశ్వర్లు, రాంబాబు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

### నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లపై చర్య తీసుకోవాలి


నారాయణ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**సూర్యాపేటటౌన్ :** జిల్లా కేంద్రంలో ఉన్న నారాయణ, శ్రీ చైతన్య పాఠశాలల్లో ఆదివారం కూడా తరగతులు నిర్వహిస్తున్నారని, ఆ రెండు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భారి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల నుంచి రూ.లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తగుళ్ల జనార్దన్, అంజి, గణేష్, శ్రీనివాస్, రాఘవ, త్యాగరాజ, నరేష్ పాల్గొన్నారు.

## 'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న రాము

**హుజూర్‌నగర్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రెడపంగు రాము కోరారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని సూచించారు. మంత్రి ఉత్తమ్ సారథ్యంలో అభివృద్ధిలో హుజూర్ నగర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానం కైవసం చేసుకోనుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ పట్టణ పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని సామాజిక వర్గాలకు స్థానం కల్పిస్తామని తెలిపారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి పిల్లి శివ, కస్తాల రవీందర్, గొట్టిముక్కల రాములు, కస్తాల సైదులు, దగ్గుపాటి బాబురావు, బొల్లెద్దు అరుణ్ కుమార్, ఊదర రంజిత్, కోల్లపూడి ప్రవీణ్, భారతం రాజు, కామల్ల రాజా, మెండ రమేష్, కందుల వెంకన్న, మాడుగుల దశరథ్ పాల్గొన్నారు.

## అర్హులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాండు

**హుజూర్‌నగర్ :** రాజకీయ జోక్యం లేకుండా అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాగారపు పాండు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో వేలాదిమంది నిరుపేదలు ఇళ్ల స్థలాలు, ఇండ్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. స్థలం ఉన్న ప్రతి పేదవాడికి ప్రభుత్వం ఇస్తానన్న రూ.5 లక్షల అందజేయాలని కోరారు. పట్టణంలోని రామస్వామి గట్టు వద్ద నిర్మిస్తున్న ఇండ్లను రాజకీయ జోక్యం లేకుండా అర్హులందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి, నాయకులు పంగా వెంకట్, దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, యోన, ఆర్ మురళి, వీరమల్లు, లింగమ్మ, వీరయ్య, సోమయ్య, వీరస్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**గరిడేపల్లి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయులను వారు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు అమృతారెడ్డి, సత్యనారాయణరెడ్డి, దయాకర్, రామ్‌రెడ్డి, ప్రభాకర్, వెంకటమ్మ, రవీందర్, పూర్వ విద్యార్థులు బాల సైదులు, వేణుగోపాల్, సైదులు, రామాంజనేయులు, నజీర్ సోని, బిబిజానీ, సరస్వతి, పావని, నాగమణి, నాగేంద్ర, కైక, రజిని పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ హయాంలోనే కుల సంఘాలకు ఆదరణ


తుంగతుర్తిలో పద్మశాలి భవన్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

**తుంగతుర్తి :** కుల సంఘాలను ఆదరించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన మార్కండేయ పద్మశాలి భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాడు తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే కుల సంఘాలను ఆదరించి అన్ని రకాల కమ్యూనిటీ భవనాలను, కల్యాణ మండపాలను నిర్మించిందని తెలిపారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం అన్ని కుల సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు సౌకర్యాలు కల్పించిందన్నారు. అనంతరం పద్మశాలిలు మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, మాజీ వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధకిషన్‌రావు, మాజీ సర్పంచ్ సంకినేని స్వరూప రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, తిరుమలప్రగడ రాహుల్, పద్మశాలి సంఘం నాయకులు ఎనగందుల శ్రీనివాస్, ఎనగందుల గిరి, అశోక్, బద్దం శ్రీను, పెండెం గణేష్, పెండెం రాంమూర్తి పాల్గొన్నారు.

### ● సండే సరదాగా..


హుజూర్‌నగర్ శివారులోని ఎన్నెస్పీ కాలువలో చిన్నారుల జలకాలాటలతో సందడి చేశారు. ఆదివారం సెలవు కావడంతో విద్యార్థులతో పాటు పలువురు యువకులు ఎన్నెస్పీ కాలువలతో ఈత కొడుతూ కేరింతలు కొట్టారు. దీంతో ఆ కాలువ ప్రాంతం సందడిగా మారింది. ముక్త్యాల మేజర్ నుంచి పొలాలకు వెళ్లే ఈ మైనర్ కాలువ లోతు తక్కువగా ఉండటంతో చిన్నారులు ఈత కొట్టేందుకు సౌకర్యంగా ఉంది.
– హుజూర్‌నగర్

# కోదాడ మున్సిపాలిటీలో పడకేసిన పాలన

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు


కోదాడ మున్సిపాలిటీ కార్యాలయం

**కోదాడ:** కోదాడ మున్సిపాలిటీలో పాలన పడకేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు మున్సిపాలిటీకి చుట్టపు చూపుగా వస్తుండడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.మున్సిపల్ కమిషనర్ 10 గంటల వరకు కార్యాలయం ముఖం చూడడం లేదని, మున్సిపాలిటీలో ఏం జరుగుతుందోనన్న కనీస సమాచారం కూడా ఇవ్వలేని దుస్థితిలో అధికారులున్నారని వారు అంటున్నారు. ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాలను మొక్కుబడిగా నిర్వహించిన అధికారులు బిల్లులను మాత్రం దండిగా పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులో ఉండడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**డ్రైయినేజీ తవ్వేసి..**

మురుగు కాలువలపై ఆక్రమణలు తొలగించాలని నోటీసులు జారీ చేసిన కోదాడ మున్సిపాలిటీ అధికారులు అదే మురుగు కాలువపై బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ముందు స్లాబ్ వేసి స్త్రీశక్తి క్యాంటీన్ నిర్మాణం చేయడమే కాకుండా ఎమ్మెల్యే చేత ప్రారంభింపజేశారు.ఇదేమిటని అడిగితే మున్సిపల్ అధికారులు మౌనం వహిస్తున్నారు. సెప్టెంబర్‌లో కోదాడ పట్టణంలో భారీ వర్షాలు రావడంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మురుగుకాల్వలల్లో పూడిక తీయకపోవడంతోనే ముంపు ఏర్పడిందని మున్సిపల్ అధికారులు హుజూర్‌నగర్ రోడ్డులో పూడిక పేరుతో ఏకంగా డ్రెయినేజీ మొత్తాన్ని తవ్వేశారు. ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆపివేశారు. ఆ తరువాత డ్రెయినేజీ మీరే కట్టుకోవాలని చెప్పడం విమర్శలకు తావిచ్చింది

**కనీస చర్యలు శూన్యం**

పట్టణంలో పలు చోట్ల వీధిదీపాలు వెలగడం లేదు. మరి కొన్ని చోట్ల పగలు రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇక ఇటీవల ఒక సమభావన సంఘానికి సంబంధించి మున్సిపాలిటీ ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో సంఘ సభ్యులకు తెలియకుండానే 10 లక్షల రూపాయలను దండుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కనీస విచారణ చేసిన దాఖలాలు లేవు. పట్టణంలో పలుచోట్ల ఉన్న ప్రజామరుగు దొడ్లు పనిచేయక తాళాలు వేసి ఉన్నాయి. పత్రికలలో వార్తలు వచ్చినా అధికారులు మాత్రం కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని పట్టణ వాసులు అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే మున్సిపాలిటీ ఎన్నికల్లో తగినమూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కొందరు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఇరుకు రోడ్డు.. రాకపోకలకు ఇక్కట్లు


రామాపురం ఇరుకు రోడ్డులో ఒకేసారి వెళ్లలేక నిలిచిన వాహనాలు

**చిలుకూరు:** మండల కేంద్రం నుంచి రామాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు ఇరుకుగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి ఇరుపక్కల ఆక్రమణకు గురి కావడంతో ఎదురుఎదురుగా రెండు వాహనాలు వస్తే ఇబ్బందులు తెలుత్తుతున్నాయి. దీనికి తోడు రోడ్డు ఇరు పక్కలా ఏపుగా పెరిగిన చెట్లు, మూలమలుపుతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. యాసంగి సాగు సీజన్ కావడంతో వరి కోత మిషన్లు, ట్రాక్టర్లు ఎదురుఎదురుగా వస్తే వెనిక్కి పోవాల్సిందే. ఈ రోడ్డు వెంట చిలుకూరు, రామాపురం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉంటాయి. ఈ రోడ్డు నుంచి కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారి, విజయవాడ– హైదరాబాద్‌కు కూడా వెళ్లవచ్చు.ఈ రోడ్డును డబుల్ లేన్‌గా మార్చి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

## అయ్యప్ప మాలధారులకు అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ కాశీ

**కోదాడరూరల్ :** ప్రజలు భక్తిమార్గంలో నడిచి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని హైదరాబాద్ కొంపెల్లి సీఐడీ సీఐ జి.కాశీ సూచించారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాలధారులకు 11 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మికతవైపు పయనించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు , మాలధారులు ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా అభివృద్ధి ఘనత జగదీశ్‌రెడ్డిదే

- మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

**సూర్యాపేటౌన్ :** ఉమ్మడి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిన ఘనత మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికే దక్కుతుందని మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెడికల్ కళాశాలలు తెచ్చిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు. గత 10 ఏళ్లలో రాష్ట్రంలో కేసీఆర్, ఉమ్మడి జిల్లాలో జగదీశ్‌రెడ్డి చేసిన అభివృద్ధిని గురించి ఎవరిని అడిగినా చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, నాయకులు వై. వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, తూడి నర్సింహారావు, బూర బాలసైదులు గౌడ్, ఆకుల లవకుశ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బడుగుల లింగయ్య యాదవ్

# రహదారులపైనే ధాన్యం ఆరబోత

- వేధిస్తున్న స్థలాల కొరత
- ఇక్కట్లు పడుతున్న రైతులు
- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి


హుజూర్‌నగర్‌రూరల్ : సర్వీస్ రోడ్డుపై రైతులు ఆరబోసిన ధాన్యం


హుజూర్‌నగర్‌రూరల్ : మిర్యాలగూడ- కోదాడ రహదారిపై పోసిన ధాన్యం రాశులు

**హుజూర్‌నగర్‌రూరల్ :** ఆరుగాలం కష్టపడి పంట పండించుకునే రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటను సాగు చేయడం ఒక ఎత్తయితే దిగుబడులను కాపాడుకుని విక్రయమించుకునేందుకు నానా తిప్పలు పడుతున్నారు. కోతల అనంతరం అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నప్పటికీ స్థలాల కొరత వేధిస్తుండటంతో రహదారులను ఆశ్రయిస్తూ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసి కల్లాలు నిర్మించుకున్న రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా నిధులు విడుదల చేస్తామని తెలిపినప్పటికీ స్థలాల కొరతతో పాటు రూ.50 నుంచి 80 వేల వరకు ఖర్చు వస్తుండటంతో రైతులు ఎవరూ ముందుకు రాలేదు.

**30వేల ఎకరాల్లో సాగు**

వానాకాలం సీజన్‌లో సాగర్ ఆయకట్టు కింద సుమారు 30వేల ఎకరాల మేర వరి సాగు చేశారు. సాగు చేసిన గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు పనులు ముగింపు దశకు వచ్చినా ధాన్యాన్ని విక్రయించుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కానీ అధికారులు, సొసైటీ నిర్వాహకులు తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకుని ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తేమ శాతాన్ని తగ్గించేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేకపోవడంతో రైతులు ఆసహనానికి గురవుతున్నారు.

**ఏళ్ల తరబడి ..**

తేమశాతం తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయం లేక ధాన్యాన్ని రహదారుల వెంబడి ఆరబెట్టుకుంటూ కష్టాలు పడుతున్నారు. హుజూర్‌నగర్ శివారు నుంచి గోపాలపురం వరకు వానాకాలం, యాసంగి సీజన్‌లలో రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం ఏళ్ల తరబడి ఆనవాయితీగా వస్తూనే ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధాన్యాన్ని ఆరబెట్టడం, రాత్రి పట్టాలు కప్పి వెళుతున్నారు. ఆదే విధంగా ధాన్యాన్ని బస్తాల్లో నింపడం కాంటాలు వేయడంతో పాటు గిడ్డంగుల సంస్థలకు, మిల్లర్లకు ధాన్యం విక్రయించేందుకు కాంటా వేసిన ధాన్యాన్ని లారీలలో ఎక్కించడం వంటి పనులు మొత్తాన్ని రైతులు రహదారుల పైనే నిర్వహిస్తున్నారు. దీనికి తోడు ధాన్యాన్ని రవాణా చేసేందుకు లారీల కొరత ఏర్పడితే కాంటా వేసిన ధాన్యం రోజులల తరబడి రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. ఇదే తరుణంలో ప్రకృతి కన్నెర్ర చేసి గాలి దుమ్ములతో కూడిన ఆకాల వర్షాలు వస్తే.. పండించిన పంటకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రహదారులపై ధాన్యాం ఆరబోస్తుండడంతో పెద్ద వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడి ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తుతున్నాయి.

### ఆరబెట్టడం సమస్యగా మారింది



కేంద్రాల్లో ధాన్యం తేమశాతాన్ని పరిగణలోకి తీసుకుని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధాన్యం ఆరబెట్టడం సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన స్థలం లేకపోవడంతో రహదారులపైనే ధాన్యాన్ని ఆరబెట్టుకుని పడిగాపులు గాయాల్సి వస్తుంది. అధికారులు చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– గువ్వల అంజినేయులు, రైతు, బూరుగడ్డ

### కల్లాల నిర్మాణానికి అధిక ఖర్చు



గత ప్రభుత్వంలో అధికారులు కల్లాల నిర్మాణంపై అవగాహన కల్పించినా నిర్మించుకునేందుకు రూ. 50 నుంచి 80 వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. కల్లాలు నిర్మించుకున్న రైతులకు ప్రభుత్వం నిధులు అందిస్తామని తెలిపినా అసలే అధిక పెట్టుబడులు, ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో కల్లాల నిర్మాణానికి సాహసించకుండా రహదారుల మీదనే ధాన్యం ఆరబెడుతున్నాం.

–తెనే సీతరాములు, రైతు అమరవరం